## నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు డివిజన్ ప్రధాన కార్యదర్శులు కవిత, స్వప్నా రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అమరేందర్, అత్తాపూర్ కార్పొరేటర్ మొండ్రా సంగీత హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారన్నారు. కార్యక్రమంలో మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ముగిసిన క్రికెట్ పోటీలు


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని సుల్తాన్‌పల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. విజేత జట్టుకు రూ.10వేలు, రన్నరప్ జట్టుకు రూ.5వేల చొప్పున నగదు పురస్కారాన్ని ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బి.జగన్ అందజేశారు. అనంతరం ఇరు జట్లకు ట్రోఫీని బహుకరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పండుగలు సంస్కృతికి ప్రతీకలు


సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

మణికొండ: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలు, పర్యావరణం, ప్రకృతికి ప్రతీకలుగా నిలుస్తాయని వాటిని ఆనందోత్సవాలతో అందరం కలిసికట్టుగా జరుపుకోవాలని ఆర్ఎస్ఎస్ భాగ్యనగర్ విభాగ్ కార్యవాహ రఘునాథ్ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీ బతుకమ్మ పార్క్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నుంచి సూర్యుడు తన గమనాన్ని మార్చుకుని ఉత్తరం వైపు పయణించటంతో ఉత్తరాయణం ప్రారంభం అవుతుందన్నారు. కొత్త పంటలు ఇంటికి చేరి రైతులు, ప్రజలు ఆనందోత్సవాలతో సంక్రాంతి పండగను జరుపుకుంటారన్నారు. సంక్రాంతి ముగ్గులు, ఆవుపేడతో పెట్టే గొబ్బెమ్మలు, ఇంటి ముందు పాలు పొంగించుకోవటం, కొత్త ధాన్యంతో చేసిన ప్రసాదాన్ని దేవునికి సమర్పించి కుటుంబ సభ్యులంతా తీసుకుంటారన్నారు. ఇలాంటి సంస్కృతి భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘచాలక్ కె. శ్రీరాంరెడ్డి, కౌన్సిలర్ ఎల్.వందననగేష్, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మీ రాములు, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు ఇందిర, శివకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తిరుకల్యాణ మహోత్సవం

రాజేంద్రనగర్:హైదర్‌గూడ చైతన్య విల్లాస్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 13న ఉదయం 9 గంటలకు స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఉర్సు

గోల్కొండ: అజ్రత్ ఖాజా మొహియుద్దీన్ చిష్టి 813వ ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆదివారం గోల్కొండ రేతిగల్లీలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరై అజ్రత్ ఖాజా మొహియుద్దీన్ చిష్టి పేదలకు, నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగులు నింపడానికి చేసిన కృషిని వివరించారు. తాను బస చేసిన ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారి జీవితాల్లో అక్షర జ్యోతిని వెలిగించారన్నారు.

## గోదాదేవికి ప్రత్యేక పూజలు

రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి అత్యంత చేరువలో ఉన్న నానక్‌రాంగూడ రంగ్‌భాగ్‌లోని రంగనాథస్వామి ఆలయంలో రెండు రోజుల ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఆదివారం ఉదయం గోదాదేవి మాతకు అభిషేకం, అలంకారం చేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రెండవ రోజు సోమవారం గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# డబ్బాల దందా..

- శంషాబాద్‌లో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- హైవేను ఆనుకుని పోర్టబుల్ డబ్బాల ఏర్పాటు
- ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల అవస్థలు


ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పోర్టబుల్ డబ్బాలు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో డబ్బాల పేరుతో ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ విషయంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జాతీయ రహదారి ఆనుకుని పోర్టబుల్ డబ్బాలతో ఫుట్ పాత్‌లను ఆక్రమిస్తున్నారు. దీంతో తరచూ రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### హైవేపై యథేచ్ఛగా..

పట్టణంలోని హైవే రహదారికి ఇరువైపుల వాణిజ్య కేంద్రాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లు దాదాపు అక్రమణలకు గురయ్యాయి. ఫుట్‌పాత్‌లను డబ్బాలు, పోర్టబుల్ డబ్బాలతో నింపేస్తున్నారు. వీటి కారణంగా తరచూ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ విషయమై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఫలితం ఉండడం లేదు. మామూళ్లకు అలవాటు పడిన మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. సంగీత మొబైల్స్ పక్కనే ఇటీవల మ్యాన్‌హోళ్లను సైతం ఆక్రమించి డబ్బాలు వేయడంతో మున్సిపల్ అధికారులు వాటిని తొలగించారు. అయితే కొద్ది రోజుల్లోనే అక్కడ మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి.

**రోడ్డుపైనే టిఫిన్ సెంటర్లు..**

గత వారం రోజులుగా హైవేను ఆనుకుని కాముని చెరువు సమీపంలోని ఓ హోటల్ ఎదురుగా భారీ పోర్టబుల్ డబ్బాలు వేసి టిఫిన్ సెంటర్‌ను పూర్తిగా బయటికి మార్చారు. దీంతో ఆ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో స్థానిక ప్రజాప్రతినిధులు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫిర్యాదు చేశారు. అయితే దానిని తొలగించకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పార్కింగ్ లేని దుకాణాలు

పట్టణంలోని దాదాపుగా అన్ని వ్యాపార కేంద్రాల వద్ద పార్కింగ్ సదుపాయాలు లేకపోవడం ఇప్పటికే పెద్ద సమస్యగా ఉంది. దీనికి తోడు ఇప్పుడు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు కూడా చోటు చేసుకుంటుడడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అయిరా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**తొలగిస్తాం**

నిబంధనలకు విరుద్ధంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు, లేదా తాత్కాలిక డబ్బాలు వేసినా వాటిని తొలగిస్తాం. మున్సిపాలిటీలో ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను త్వరలోనే పరిశీలించి చర్యలు చేపడతాం.

– సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

## సంక్రాంతిని సంబరంగా జరుపుకోవాలి



మణికొండ: ప్రజలు సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకోవాలని మణికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్లు యాలాల లావణ్య నరేష్, బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, పి.శైలజ వినోద్, వందన నగేష్, బి.కావ్యశ్రీరాములు, జ్యోతి మల్లేష్, కోఆప్షన్ సభ్యురాలు జె. లక్ష్మీరాములు అన్నారు. ఆదివారం మున్సిపల్ కేంద్రంలోని శివపురి కాలనీలో కౌన్సిలర్ యాలాల లావణ్య నరేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రకృతి, పాడి పంటలకు ముడిపడి ఉన్న పండుగ సంక్రాంతి అన్నారు. మహిళలు సంక్రాంతి పండగకు వారి ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి అందంగా తీర్చిదిద్దుతారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ముగ్గులు వేసిన మహిళలకు కౌన్సిలర్‌లు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి రామస్వామి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న వెంకటయ్య

మైలార్‌దేవ్‌పల్లి: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి అండగా నిలవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి వెంకటయ్య అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఉద్దెంగడ్డ రైల్వే స్టేషన్ ప్రాంతంలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డాల వద్ద షెడ్లు ఏర్పాటు చేయాలని కార్మికులు కూర్చునేందుకు బెంచీలు, బాత్‌రూమ్‌ల నిర్మించాలన్నారు. ఇన్సూరెన్స్ కార్డులు అందించాలన్నారు. కోట్ల రూపాయలు సంక్షేమ బోర్డులో నిల్వ ఉన్నా లేబర్ అధికారులు ప్రభుత్వాధికారులు అడ్డాల వద్ద కార్మికులను గుర్తించి సంక్షేమ బోర్డు ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. రేషన్ కార్డుతో పని లేకుండా భవన నిర్మాణ కార్మికులకు ఆధార్ కార్డుపైనే ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**నూతన కమిటీ ఎన్నిక...**

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా కాషమాన్, ఉపాధ్యక్షుడిగా అర్జున్‌దాస్, కార్యదర్శిగా మహరాజ్, కోశాధికారిగా అస్లాం, సహాయ కార్యదర్శిగా ఎండీ రఫీ, 10 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## మార్కెట్‌ల అభివృద్ధికి కృషి


బబ్బుగూడ మార్కెట్‌లో పర్యటిస్తున్న పాలకకమిటీ నాయకులు

మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బబ్బుగూడ, శంషాబాద్ మార్కెట్‌లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేణుగౌడ్, వైస్ ఛైర్మన్ కె. దశరథయాదవ్ అన్నారు. ఆదివారం వారు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లతో కలిసి బబ్బుగూడ మార్కెట్‌లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులు మార్కెట్‌లో షెడ్‌లను నిర్మించాలని, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లను నిర్మించాలనికోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే వ్యాపారులు అడిగిన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. నార్సింగి మార్కెట్‌లో ఈనెల 24న పశుసంక్రాంతిని నిర్వహిస్తామని, పెద్ద ఎత్తున వ్యాపారులు తమ గేదెలను తీసుకుని రావాలని, రైతులు వాటిని కొనుగోలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పాలకకమిటీని వ్యాపారులు ఘనంగా సత్కరించారు.

## హెచ్‌సీయూ డిపో నుంచి ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: సంక్రాంతి పండగకి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ద్వారా ప్రత్యేక బస్సులు వేశామని డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆదివారం ఒక్కరోజు 39 ప్రత్యేక సంక్రాంతి బస్సులను నడిపినట్లు తెలిపారు. 25 ప్రత్యేక బస్సులను గచ్చిబౌలి కూడలి నుంచి జడ్చర్ల వరకు నడిపినట్లు చెప్పారు. అంతేకాకుండా లింగంపల్లి కూడలి నుంచి 14 బస్సులను నారాయణఖేడ్, పిట్లమ్ వరకు బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే మేలని తెలిపారు. గచ్చిబౌలి, లింగంపల్లిలోని కూడళ్లలో ప్రత్యేక బస్సుల రాకపోకలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌సీయూ డిపో సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ముదిరాజ్ సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్


బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ముదిరాజ్ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం రాష్ట్ర ముదిరాజ్ సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమలో బీఆర్ కృష్ణ, యాదయ్య ముదిరాజ్, వెంకటయ్య ముదిరాజ్, పానుగంటి గోపాల్ ముదిరాజ్, నర్సింహ ముదిరాజ్, పాండు, మల్లేష్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## వార్డు కార్యాలయ అభివృద్ధికి కృషి


వార్డు కార్యాలయం స్లాబ్ పనులను ప్రారంభించిన కౌన్సిలర్ ఉషారాణి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనాన్ని నూతన వార్డు కార్యాలయంగా అభివృద్ధి చేస్తున్నామని, దీంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. ఆదివారం ఆమె వార్డు కార్యాలయ స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ కేంద్రంలోని వార్డులకు కార్యాలయాలు లేక ఇబ్బందిగా పడుతున్నారన్నారు. పాత కార్యాలయంలో ఉన్న పోలింగ్ బ్యాలెట్ బాక్సులను తీయించి దానిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. గ్రామ స్థాయి సమావేశాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు వెంకన్న గుట్ట వేంకటేశ్వర స్వామి ఆలయంలో
## గోదా రంగనాథుల కల్యాణం



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శ్రీ వెంకన్న గుట్టపై కొలువుదీరిన శ్రీ భూ నీలా సహిత శ్రీ వేకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా సోమవారం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటలకు అత్యంత వైభవంగా కల్యాణాన్ని చేపడుతున్నామన్నారు. అనంతరం భక్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



## స్వామి వివేకానంద జయంతి సందర్భంగా క్రికెట్ పోటీలు...


స్వామి వివేకనంద జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: స్వామి వివేకానంద 162వ జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. రాజేంద్రనగర్‌కు చెందిన 8 జట్లు పాల్గొనగా.. బుద్వేల్‌కు చెందిన కెప్టెన్ శత్రుఘ్న టీమ్ మొదటి బహుమతి గెలుపొందగా... రెండో బహుమతి కెప్టెన్ జగదీష్ కుమార్ జట్టు సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా సాయి నాయక్ ఎంపికయ్యారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, వేముల దయాకర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, డాక్టర్ అమరేందర్, నాయకులు బొక్కా బాల్‌రెడ్డి, ధీరజ్ యాదవ్, డి.యాదగిరి, రమణ, టి.మల్లేష్, ఎం.భాస్కర్ యాదవ్, స్వామి, పి.రాజు, రఘుమారెడ్డి, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో పనిచేసే కార్యకర్తలకు పెద్దపీట


మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ పార్టీలో పని చేసే కార్యకర్తలకు పెద్దపీట వేయడం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గుడిమల్కాపూర్ వెజిటెబుల్ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ పత్రాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఆయనను కలిసి అందించారు. ఈ నెల 17న నూతనంగా నియమించబడిన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఉందని ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, ముంగి రఘుపాల్‌రెడ్డి ఆయనను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి కింది స్థాయి కార్యకర్తల కృషి ఎంతగానో ఉందని ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు అన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి


ఆదర్శ కాలనీలో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నవయువ యూత్ క్లబ్ సభ్యులు,


అలకాపూర్‌లో..

మైలార్‌దేవ్‌పల్లి: చిన్న వయస్సులోనే ప్రపంచ దేశాల్లో పర్యటించి భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని ప్రచారం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. యువతకు ఆయన రచనలు ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీలోని శ్రీ గాయత్రీ పొదుపు సంఘం ఆవరణలో స్వామి వివేకానంద 162వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ వివేకానందుడు చిన్నతనం నుంచే ఆధ్యాత్మికత వైపు నడిచి యువతను సన్మార్గం వైపు నడవాలని సూచించారన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కొంపల్లి జగదీష్, సంస్కృతిక కార్యదర్శి గొంట్యాల శ్రీనివాస్, సంతోష్‌కుమార్ శెట్టి, శ్రీ గాయత్రీ పొదుపు సంఘం సలహాదారులు కూడికల గణమ్మ, ఉపాధ్యక్షులు దశపతి భిక్షపతి, దశపతి రాజు, సంగిశెట్టి లక్ష్మణ్, లీలా, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పద్మశాలిపురంలో..

**పద్మశాలిపురంలో...**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ్ ఆధ్వర్యంలో పద్మశాలిపురంలోని స్వామి వివేకానంద విగ్రహాన్ని పూలతో అందంగా ముస్తాబు చేశారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాశిగారి యాదగిరి, ప్రేమ్‌గౌడ్, మునగపాటి వెంకటేష్, రామకృష్ణ, బొల్ల వెంకటేష్, యంజాల శేఖర్, ప్రశాంత్‌గౌడ్, ఖలీల్, యేసు తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: స్వామి వివేకానంద జయంతిని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ ఎస్వీ పార్కులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు నవీన్‌కుమార్, పద్మారావు మాట్లాడుతూ ప్రపంచానికి మన దేశ సత్తాను చాటిచెప్పి మహనీయుడు స్వామి వివేకానంద అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత జీవితంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు జయకృష్ణ, ప్రమోద్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.